క్లుప్తంగా

రాచమల్లు ప్రవీణ్ మృతి బాధాకరం



రాచమల్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: అనంతపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా సమన్వయకర్తగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాచమల్లు ప్రవీణ్ విఠల్‌రెడ్డి (52) మృతి పార్టీకి తీరని లోటు అని ఉరవకొండ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రవీణ్‌విఠల్‌రెడ్డి రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. సోమవారం సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి రాచమల్లు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రవీణ్ వైఎస్సార్‌సీపీకి ఎన్నో సేవలు అందించారని ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, కూడేరు మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ సీడీపీఓ యల్లమ్మ

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అడిషనల్ సీడీపీఓ యల్లమ్మ ఆదేశించారు. సోమవారం ఆమె కరుట్లపల్లిలోని అంగన్‌వాడీ–1,2 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు, ఎదుగుదల, ఆహార రిజిష్టర్లను, మొబైల్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని పెట్టాలని ఆమె సూచించారు. సూపర్ వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కమ్మ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ



కంబదూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కంబదూరు: కంబదూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు స్టేషన్‌ను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సారా, కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా, విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్తులను బైండోవర్ చేయించాలని ఆదేశించారు.

నిబంధనలు పాటించాలి



వేపులపర్తి క్రాస్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ఈశ్వరయ్య

గుమ్మఘట్ట: ఆటో డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. మండలంలోని వేపులపర్తి క్రాస్ వద్ద ఆటోడ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదన్నారు. మద్యం సేవించి , సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే వరకూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసిన ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దాడిలో వడ్డే లోకేష్, పింజరి దాదా, బోయ వీరేష్, హరిజన శివరుద్ర, బోయ నాగరాజు, హరిజన అంజినేయ, బోయ హనుమంతును అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.1,950 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

పరిశుభ్రత కనుమరుగు

- ఎక్కడి చెత్త అక్కడే!
- స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు ఆర్భాటమే
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పల్లెల పరిశుభ్రతపై పట్టించుకోని అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటనలకు దూరం



శ్రీకృష్ణమందిరం సమీపంలో రోడ్లపైనే పడేసిన చెత్త



కళ్యాణదుర్గంలో వెంకటేశ్వర థియేటర్ వద్ద పూర్తిగా పూడికతో నిండిన మురుగు కాలువ

బ్రహ్మసముద్రం : పల్లెల పరిశుభ్రత, స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా నినాదంతో 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమాలు ఆర్భాటంగా నిర్వహించి, చేతులు దులుపుకోవడంతో ఎక్కడి చెత్త అక్కడే.. మురుగు నీరు ముందుకు సాగేదేలే.. అన్నట్లుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. ఎటుచూసినా అపరిశుభ్రత, ఎక్కడ చూసినా చెత్తాచెదారం నిండి ఉండడంతో గ్రామాల్లో జనం అనారోగ్యం బారిన పడుతున్నారు. నియోజకవర్గంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, కళ్యాణదుర్గం రూరల్, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాలు ఉన్నాయి. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో–24 వార్డులు, కళ్యాణదుర్గం రూరల్–17, బ్రహ్మసముద్రం–16 , శెట్టూరు –16, కుందుర్పి–13 , కంబదూరు–12 చొప్పున మొత్తం–74 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ త హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు,ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టలేదు. గ్రీన్ అంబాసిడర్లు ప్రస్తుతం కనుమరుగు అయ్యారు. నాలుగు నెలలుగా వేతనాలు మంజూరు చేయకపోవడంతో పల్లెల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, పల్లెల్లో పలుకాలనీల్లో ఇళ్ల మధ్య పేరుకు పోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా కాలువలు సక్రమంగా లేక ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్లపైకి చేరుతోంది. కళ్యాణదుర్గంలోని పలు కాలనీల్లో కాలువలు పూడికతో నిండిపోయాయి. దీంతో మురుగునీరంతా రోడ్లపైనే పారుతోంది. పందుల సంచారంతో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. మురుగు నీరంతా రోజుల తరబడి నిలిచి పోవడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. పారిశుధ్య లోపంతో దోమలు వ్యాప్తి చెంది, జనం రోగాల బారిన పడుతున్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యటనలకు దూరం..

స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను అన్ని గ్రామాల్లోనూ ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు హడావిడిగా నిర్వహించారు. కానీ పారిశుధ్యం మెరుగునకు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో పర్యటించాల్సిన మండల అధికారులు తూతూమంత్రంగా పర్యటించి, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేసి, ఫొటోలకు ఫోజులిచ్చి కార్యక్రమాలను ముగిస్తున్నారు.



కుందుర్పి మండలం బోదపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

రోడ్లపైనే మురుగునీరు



మా గ్రామంలో పారిశుధ్యం లోపించింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. కాలువలలో పూడిక నిండి, మురుగునీరు ముందుకు కదలలేదు. దీంతో రోడ్లపైనే మురుగునీరుపారుతోంది. దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు చేపట్టాలి .

– దండు హనుమంతు, నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

ఎటు చూసినా అపరిశుభ్రతే ..



ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకొచ్చిన తర్వాత గ్రామాల పరిశుభ్రతపై దృష్టి పెట్టలేదు. గ్రామాల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. చెత్త చెదారం ఎక్కడబడితే అక్కడ దిబ్బల్లా ఉంటోంది. దీంతో దోమల బెడద అధికమైంది.

– లోకేష్‌రెడ్డి, వర్లి, కళ్యాణదుర్గం మండలం



బ్రహ్మసముద్రంలో సొసైటీ కార్యాలయం ఎదుట పేరుకు పోయిన చెత్త

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఈ నెల 20 నుంచి జరిగే భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం జుంజురాంపల్లి గ్రామంలో రీసర్వే ప్రాజెక్ట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఈనెల 20 నుంచి భూముల రీసర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

చిరుత దాడిలో 45 గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు చూపుతున్న రైతు

రాయదుర్గం: చదం గ్రామ సమీపంలో చిరుత దాడిలో 45 గొర్రె పిల్లలు సోమవారం మృతి దాచెందాయి. బాధిత కాపరులు తెలిపిన మేరకు.. గ్రామ సమీపంలోని ముత్తప్ప తోటలో ముత్తప్ప, బొమ్మయ్య, గంగాధర అనే కాపరులు గొర్రెలను మందకు వదిలారు. అక్కడే ఏర్పాటు చేసిన దొడ్డిలో గొర్రె పిల్లలు ఉంచి, మేత కోసం మందను అడవికి తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో దొడ్డిలోకి చిరుత చొరబడి దాడి చేసింది. బొమ్మయ్యకు చెందిన 10 గొర్రె పిల్లలు, గంగాధర కు చెందిన 20 గొర్రెపిల్లలు, ముత్తప్ప 15 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. మరో 10 గొర్రె పిల్లలకు చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పాండునాయక్ మృతదేహం

బొమ్మనహాళ్: బ్రాహ్మణపల్లి తండాకు చెందిన పాండునాయక్ (59) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పాండునాయక్ ఈనెల 4న పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. మృతుడికి భార్య జయమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు ధ్వంసం చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ బాలకిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంబదూరు: ఎలాంటి అనుమతులు లేకున్నా పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులను ప్రైవేట్ కాంట్రాక్టర్లు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బాల కిషన్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెడ్పీటీసీ నాగరాజు, నాయకులు భీమేష్, హనుమంతరాయుడు, సర్పంచులు రాజగోపాల్, చెన్నయ్య తదితరులు సమస్య విన్నవించారు. వారు మాట్లాడుతూ మండలంలోని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారుల పక్కన కొద్ది రోజులుగా ఓ ప్రైవేట్ టెలికం సంస్థ లైన్ ఏర్పాటు కోసం విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారన్నారు. తద్వారా రోడ్డు అతుకులతో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్యాలు, మారెన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం రైతుల నిరీక్షణ



ఏఈ కార్యాలయం ఎదుట ఎదురుచూస్తున్న రైతులు

బ్రహ్మసముద్రం : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కోసం అవసర మైన డీడీలు తీసి, అధికారులకు అందజేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట నంజాపురం, బ్రహ్మసముద్రం, నాగిరెడ్డిపల్లి, భైరసముద్రం, సంతే కొండాపురం, పాలవెంకటాపురం తదితర గ్రామాల రైతులు పడిగాపులు కాశారు. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. రైతులు మాట్లాడుతూ గతంలో పని చేసిన ఏఈ బాలచంద్ర రైతుల నుండి డబ్బులు తీసుకుని కనెక్షన్లు ఇచ్చారన్నారు. సీనియారిటీ ప్రకారం ఇవ్వాల్సిన కనెక్షన్లు, ట్రాన్స్ ఫార్మర్లను చేతులు తడిపిన వారికే ఇచ్చారన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు పథకాలు వర్తింపజేయాలి



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయదుర్గంటౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో పనిచేసే అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు గోవిందమ్మ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వర్కర్లతో కలిసి సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వర్కర్ల యూనియన్ కార్యదర్శి మేరి, కోశాధికారి రాధమ్మ, సెక్టర్ లీడర్లు మెహరూన్, రాధిక, అనురాధ, రూప, ఉలిగమ్మ, రుద్రమ్మ పాల్గొన్నారు.

న్యాయవాది కేసును సీబీఐతో విచారణ చేయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న న్యావాదులు

కళ్యాణదుర్గం రూరల్: సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి కేసును సీబీఐతో విచారణ చేయించాలని కళ్యాణదుర్గం బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం డిమాండ్ చేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత పోలీసు వ్యవస్థ గాడి తప్పిందన్నారు. అనంతపురంలో 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మరణించిన సీనియర్ న్యాయవాది శేషాద్రి కేసును సీబీఐతో విచారణ చేయించాలన్నారు. అనంతరం కోర్టు నుంచి ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నిరసన తెలియజేశారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై భయాందోళనలొద్దు

- మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్



అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్

రాయదుర్గంటౌన్: చైనాలో గుర్తించిన హ్యూమన్ మెటా న్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ)పై ప్రజలు ఏమాత్రం భయాందోళనలు చెందాల్సిన అవసరంలేదని, జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ సూచించారు. స్థానిక 13వ వార్డులోని కాలనీల్లో స్వస్థ రాయదుర్గంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత అంశాలపై ప్రజలకు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలోగాని, రాష్ట్రంలో గాని ఎక్కడా వైరస్ బారిన పడిన కేసులు లేవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి, లక్ష్మీనరసమ్మ, శానిటేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

'దుర్గం'లో మహిళా ఓటర్లే అధికం

- సార్వత్రిక ఎన్నికల తర్వాత పెరిగిన ఓటర్ల సంఖ్య
- ఓటర్ల జాబితాలు విడుదల చేసిన అధికారులు



తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం : జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. రాయదుర్గం ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఎన్నికల డీటీ సుజాతకు అందజేశారు. రెండు నెలల పాటు సర్వేతోపాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు, ఆన్‌లైన్‌లో వచ్చిన క్లెయిమ్‌లపై విచారణ చేపట్టారు. ఆ వివరాలతో గతేడాది అక్టోబర్ 29న ముసాయిదా జాబితా విడుదల చేశారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలతోపాటు కొత్తగా చేర్పులు, తొలగింపులకు వచ్చిన దరఖాస్తులను విచారించి, తాజాగా తుది జాబితా ప్రచురించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని 296 పోలింగ్ బూత్‌లకు గానూ మొత్తం ఓటర్లు 2,64,186 ఓటర్లు ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే రాయదుర్గం నియోజకవర్గంలో 3,262 మంది ఓటర్లు పెరిగారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఓటర్ల తుది జాబితాను సోమవారం ఆర్డీఓ వసంతబాబు విడుదల చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో తుది జాబితా జాబితాలను ఆయా బీఎల్వోలకు అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,31,817గా నమోదయ్యాయి. ఇందులో మహిళా ఓట్లు సుమారు 2,142 అధికంగా ఉన్నాయి. దీంతో దుర్గం ఓటర్లలో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు.

రాయదుర్గం నియోజకవర్గంలో తుది ఓటర్ల జాబితా వివరాలు :

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డి.హీరేహాళ్	18,385	18,496	5	36,886
బొమ్మనహాళ్	23,202	23,430	13	46,645
కణేకల్లు	26,166	26,982	7	53,155
రాయదుర్గం రూరల్	17,072	17,370	3	34,445
రాయదుర్గం అర్బన్	25,670	27,556	16	53,242
గుమ్మఘట్ట	20,054	19,694	0	39,748
సర్వీస్ ఓటర్లు	63	2	0	65
మొత్తం	1,30,612	1,33,530	44	2,64,186

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా ఇలా...

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బ్రహ్మసముద్రం	17,552	17,441	1	34,994
కళ్యాణదుర్గం (అర్బన్)	17,518	18,924	2	36,444
కళ్యాణదుర్గం (రూరల్)	19,342	19,386	2	38,730
శెట్టూరు	17,207	17,262	1	34,470
కుందుర్పి	22,026	22,102	0	44,128
కంబదూరు	21,189	21,861	1	43,051
మొత్తం	1,14,834	1,16,976	7	2,31,817

సంక్షిప్త సమాచారం

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ వద్ద ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణతో కలసి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రాములు సోమవారం ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ బి.తిప్పేస్వామి, సీనియర్ కమిటీ సభ్యులు సి.తిప్పేస్వామి, సంగప్ప, రాజశేఖర్, మోహన్‌రాజు, గంగాదర్, వెంకటేషులు, విశ్వనాథ, జీ.రాము, వనిత పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ మొదటి వార్షికోసం సందర్భంగా మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ఈనెల 19న జ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షకు హాజరుకావాలన్నారు. సెల్: 9493 976058, 9491834267లో సంప్రదించాలన్నారు.

'శ్రీరామరెడ్డి' తాగునీరు బంద్

కుందుర్పి: మండల వ్యాప్తంగా వారం రోజులుగా శ్రీరామరెడ్డి తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లో ప్రధాన పైప్‌లైన్ ధ్వంసమైంది. పైప్‌లైన్లను మరమ్మతు చేయకపోవడంతో గ్రామాలకు నీరు సరఫరా కాలేదని అధికారులు చెప్తున్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో మరమ్మతులు చేయక 36 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది.

మట్టి పరీక్షలపై అవగాహన

కుందుర్పి: మండల కేంద్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్), డిజిటల్ గ్రీన్ సంస్థ పర్యవేక్షణలో మట్టి పరీక్షల నిర్వహణ, సేంద్రియ ఎరువుల వాడకంపై సోమవారం అవగాహన కల్పించారు. భూసార మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేయాలని సంస్థ ప్రతినిధులు అశోక్,వాణి, అంజి సూచించారు. డైరెక్టర్ లక్ష్మీపతి, సీఈఓ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాబెర్రీ పండ్లతో జంబుకేశ్వరుడి అలంకరణ



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. స్ట్రాబెర్రీ పండ్లతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళ నైవేద్యాలు చేపట్టారు.

ప్రజా వేదికలో వినతుల వెల్లువ

కూడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మండల సర్వేయర్ ఆయేషా సిద్ధిఖీ అర్జీలను స్వీకరించారు. సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, రీసర్వే డీటీ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ సుధాకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ అశోక్ హాజర అయ్యారు.

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతులు అందాయని తహసిల్దార్ నయాజ్ అహమ్మద్ తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కుందుర్పి: స్థానిక ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు మండలంలోని పలు గ్రామాల ప్రజలు సోమవారం వినతిపత్రం అందించారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఏ శ్రీనివాస్‌గుప్త సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.